పల్లెల్లో ఊపందుకున్న వరినాట్లు



పెళ్లకూరు మండలం చిల్లకూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు



వరినారు సిద్ధం చేస్తున్న కూలీలు

- వర్షాలు కురవడంతో చెరువులకు చేరిన వర్షపు నీరు
- ఈ ఏడాది 4,750 హెక్టార్లలో వరిసాగు

పెళ్లకూరు : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరుతోంది. అలాగే అధికారులు పునబాక, చెంబేడు, పెళ్లకూరు, రావులపాడు, చిల్లకూరు, జీలపాటూరు తదితర చెరువులకు తెలుగు గంగ నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. నారుమడులు సిద్ధం చేయడం, పొలం గట్లు శుభ్రం చేయడం, ట్రాక్టర్లతో దుక్కి దున్నడం, ఎడ్లమానుతో భూమిని చదును చేయడం, వరినాట్లు వేయడం తదితర పనులతో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీబిజీగా మారారు. శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలు, స్థానికులతో వరినాట్లు వేసే పనులు జోరందుకున్నాయి. ఈ యేడాది మండలంలోని 24 పంచాయతీల్లో 67 మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద సుమారు 4,750 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, యంటీయూ 1224, యంటీయూ 1262, కేఎన్‌యం 16038 రకాల వరి వంగడాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.



జీలపాటూరులో ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు



నిండుకుండలా పెళ్లకూరు చెరువు



శిరసనంబేడు పంట కాలువలో వరదనీటి ప్రవాహం

మహిళకు రూ.10 వేల ఆర్థిక సాయం

చిల్లకూరు : చిల్లకూరు దళితవాడకు చెందిన సంక్రాంతి శైలజ అనారోగ్యం బారిన పడి నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యం ఖర్చులు భారంగా మారాయి. ఈ విషయాన్ని స్థానికులు చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు రూ.10 వేల సాయం అందించడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో ట్రస్టు ప్రతినిధులు రామానాయుడు, పిచ్చయ్యనాయుడు పర్యవేక్షణలో బాబు ద్వారా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శైలజకు రూ.10 వేలు అందజేశారు. ట్రస్టు నిర్వాహకులకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుడికి చైర్ పర్సన్ నివాళి



పెంచలయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దీపిక, సుబ్రమణ్యం రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు దామవరపు పెంచలయ్య(55) అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న చైర్ పర్సన్ కటకం దీపిక శనివారం వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డితో కలిసి బిరదవాడ గ్రామానికి చేరుకున్నారు. పెంచలయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్లుప్తంగా

ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలి

రాపూరు: విద్యార్థులు ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కందుకూరు వీరేశలింగం పంతులు, నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ తదితర కవుల గురించి వివరించారు. కార్యక్రమంలో టీచర్ యమున, రాపూరు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ, సహాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ అధ్యాపకురాలికి డాక్టరేట్



అధ్యాపకురాలిని అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈఈఈ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పి.ధనసెల్వికి అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె ఇంటలిజెంట్ పవర్ సిస్టం స్టెబిలైజర్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ట్రాన్సింట్ స్టెబిలిటీ ఇన్ మల్టీమిషన్ పవర్ సిస్టం అనే అంశంపై పరిశోధన చేశారు. ఆమెను శనివారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ సురేష్‌రెడ్డి అభినందించారు.

త్వరితగతిన ల్యాబ్ భవన నిర్మాణం

కోట: మండలంలోని చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద రూ.10 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం చేపట్టారు. పనులను శనివారం ఎంఈవో మస్తానయ్య పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతపై వారికి పలు సూచనలు ఇచ్చారు. వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ శుభకర్‌రావు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నేతలు

సైదాపురం: ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి సైదాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని దుయ్యబట్టారు. 2023–2024 సంబంధించి మరో రూ.11,826 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్మార్ట్ మీటర్లు ఏర్పాటును విరమించుకోవాలన్నారు. అనంతర ఏఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు.


పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి

దక్కిలి : ప్రణాళికలు రూపొందించుకుని గ్రామ పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోనురాజశేఖర్, సీఆర్పీ చంద్రశేఖర్, ఏఈవో వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు



శ్రీవారి వనంలో వనభోజనాలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీక మాస వనభోజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవారి వనంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్లక్ష్యంతోనే ఆగిన పోర్టు పనులు



నాయుడుపేట పాత బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న చింతా మోహన్

నాయుడుపేట టౌన్ : సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే దుగరాజపట్నం పోర్టు పనులు ఆగిపోయాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ ఆరోపించారు. ఆయన శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దుగరాజపట్నం పోర్టు పనులను ప్రారంభించాలని కోరుతూ నాయుడుపేట పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో దుగరాజపట్నం పోర్టు అంశం ఉందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎలాంటి ప్రస్తావన చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పోర్టు పనులు పూర్తయితే చెన్నై, విశాఖపట్టణంలా నాయుడుపేట, గూడూరు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ఉత్తుత్తి మాటలతో చంద్రబాబు మోసం

వెంకటగిరి రూరల్ : చంద్రబాబు నాయుడు ఉత్తుత్తి మాటలు చెబుతూ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఆయన శనివారం వెంకటగిరి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మన్నవరం భెల్ పరిశ్రమను ప్రారంభించారని, 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు భెల్ పరిశ్రమను నిర్లక్ష్యం చేశాయని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భెల్ పరిశ్రమను పునఃప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

బాలాయపల్లి(సైదాపురం) : బాలికలు, మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష హెచ్చరించారు. బాలాయపల్లి మండలం వెంగమాంబ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం సమీపంలో ఉన్న వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాంధీ, రాజేష్, రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

గూడూరు రూరల్ : కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. ఆయన శనివారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తామని చెప్పిన మాట ఏమైందని నిలదీశారు. ఉచిత ఇసుక అన్నారని, గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. హామీలను నెరవేర్చకుంటే కూటమి నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు కాలేషా, ఎంబేటి చంద్రయ్య, నారాయణ, రమేష్, భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, యాకోబ్, అంకయ్య, శేషయ్య, రమేష్ తరదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలతో జేవీవీ సభ్యులు, ఎంఈవో

గూడూరు రూరల్ : ఇటీవల నిర్వహించిన చెకుముకి పోటీల విజేతలకు శనివారం జన విజ్ఞాన వేదిక నాయకులు గూడూరులోని శారదా నగర్‌లో ఉన్న లిటిల్ ఏంజిల్ పబ్లిక్ స్కూల్‌లో బహుమతులు అందజేశారు. చిల్లకూరు ఎంఈవో రవూఫ్ మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభను గుర్తించేందుకు చెకుముకి టాలెంట్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, హెచ్ఎం సురేష్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

రాపూరు : మండలంలోని 21 పంచాయతీల్లో ఉపాధిహామీ కింద చేసిన పనులపై సామాజిక తనిఖీలో తేలిన వివరాలపై శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో 2023–24లో రూ.15,67,89,738లు ఖర్చు చేసి 962 పనులు చేపట్టినట్టు తెలిపారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పరిశీలించినట్టు పేర్కొన్నారు. గోనుపల్లి పంచాయతీలో మరోసారి తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మండలంలో రూ.14 లక్షల వరకు అవకతవకలు జరిగినట్టు తేలిందని, ఆ మొత్తాన్ని రికవరి చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, డీవీవో విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోలర్ సతీష్, ఏపీడీ శంకర్‌నారాయణ, ఎస్‌టీఎం కోనయ్య, ఎస్ఆర్‌పీ నాగార్జున పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు



నిందితుడితో పోలీసులు

వాకాడు : మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ బాలకృష్ణ, వాకాడు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు కొండాపురంలో దాడి చేసి యనమల శీనయ్యను అరెస్టు చేశామన్నారు. అతని నుంచి 12 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

సైదాపురం: సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. ఆమె శనివారం సైదాపురంలోని పొదుపు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీల్లో నోటీసు బోర్డుల్లో పెట్టామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలో 12 సాగునీటి సంఘాలకు ఎన్నికలను త్వరలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొదలకూరు డీఈ హేమవిరిత, ఏఈ శ్రీనివాసులు, డీటీ అనూరాధ పాల్గొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష దీపోత్సవం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్టు కన్యకా పరమేశ్వరి వలంటీర్ సంఘం అధ్యక్షుడు కాకి శ్రీరామ్మూర్తి, కార్యదర్శి పైడిమర్రి కిషోర్ తెలిపారు. గణపతి పూజ, శివ అష్టోత్తరం, అమ్మవారికి కుంకుమ పూజ, విష్ణు అష్టోత్తరం, తులసీ అష్టోత్తరం, దీపలక్ష్మీ అష్టోత్తరం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

డిసెంబర్ 14న లోక్ అదాలత్



లోక్ అదాలత్‌పై సమీక్షిస్తున్న జడ్జి సులోచన

గూడూరు రూరల్ : వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కరించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచనా రాణి తెలిపారు. ఆమె శనివారం గూడూరు కోర్టులో పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కేసుల్లో ఇరువర్గాల వారు రాజీ చేసుకుని న్యాయం పొందాలన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలి

వెంకటగిరి రూరల్ : పంచాయతీల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళికలు రూపొందించుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

కండలేరులో 51.814 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 51.814 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ నుంచి 200 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 2700 క్యూసెక్కుల నీరు చేరుతోందని పేర్కొన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆగమోక్తంగా ఆకాశ దీపం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశ దీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశ దీపం వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయంలోని ఊంజల్ సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

పంట కాలువపై నిర్మాణ పనుల పరిశీలన



రైతులు, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామం వద్ద వ్యవసాయ పంట కాలువపై చేపట్టిన హై ఓల్టేజ్ విద్యుత్ హై టెన్షన్ టవర్ నిర్మాణ పనులను శనివారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. 71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న హైఓల్టేజ్ విద్యుత్ తీగల ఎత్తు పెంచేందుకు టవర్ నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామస్తులు శుక్రవారం పనులను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మహేష్, మెగా ఇన్‌ఫ్రా కంపెనీ ప్రతినిధులు శనివారం హై టెన్షన్ టవర్ నిర్మాణం చేపట్టిన స్థలాన్ని పరిశీలించారు. వ్యవసాయ పంట కాలువపై నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోయారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చాకే పనులు చేపట్టామంటూ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. దాంతో ఇరువురి మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది.అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో సుమతి, సర్వేయర్లు లక్ష్మణ్, సూర్య మెగా కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఇసుకను తోడేస్తున్నారు



కరకట్టల అంచున తవ్వేయడంతో పడిన గుంతలు

చిట్టమూరు (వాకాడు) : చిట్టమూరు మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేస్తున్నారు. మండలంలోని మెట్టు గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిని గుల్ల చేస్తున్నారు. అంతటితో ఆగక కరకట్టల అంచున ఉన్న ఇసుకను సైతం తోడేస్తున్నారు. దీంతో వరదల సమయంలో కట్టలకు గండిపడి నీరు పంట పొలాలపైకి చేరే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందనలు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

చిల్లకూరు : చెకుముకి పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను శనివారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జాన్‌పీటర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ గూడూరుకు చెందిన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చెకుముకి పోటీల్లో తమ విద్యార్థులు ఐదుగురు పాల్గొన్నారని తెలిపారు. వారిలో బాల కార్తీక్, ప్రణీత్‌సాగర్, ఎస్‌కే కాషీఫా మండల స్థాయిలో విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై సులోచన, శంకరయ్య, పీడీ శ్రీనివాసులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న మాంసం ధరలు



- పప్పు, పచ్చడితో సరిపెట్టుకుంటున్న సామాన్యులు
- గతంలో ఎన్నడూ ఇలా ధరలు పెరగలేదంటున్న వైనం

వెంకటగిరి రూరల్ : వారాంతంలో మాంసం తినాలని ఎక్కువ మంది అనుకుంటారు. ముఖ్యంగా ఆది, మంగళవారాల్లో ఎక్కువ మంది మాంసం తింటారు. కొందరికి వారంలో రెండు రోజులు నీచు లేనిదే ముద్ద దిగదు. ఈ క్రమంలో మాంసం ధరలు అమాంతం పెరిగాయి. దీంతో పప్పు, కూరగాయలతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని మాంసం ప్రియులు వాపోతున్నారు. వాటి జోలికే వెళ్లడం మానేశామని సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు చెబుతున్నారు. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయి. మాంసం ధరలు తగ్గుముఖం పడుతుంటాయి. ప్రస్తుతం మాంసం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బ్రాయిలర్ కోడి లైవ్ రూ.100లు, మాంసం రూ.190లు, స్కిన్‌లెస రూ.210లకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా లేయర్ కోడి లైవ్ రూ.110, మాంసం రూ.190లు, స్కిన్‌లెస్ రూ.220లకు అమ్ముతున్నారు. నాటు కోడి లైవ్ రూ.450లు, మాంసం రూ.600లు, పొట్టేలు మాంసం రూ.700 నుంచి రూ.800లు, మేకపోతు మాంసం రూ.700 నుంచి రూ.800ల వరకు విక్రయిస్తున్నారు. అరకొర వచ్చే ఆదాయంలో అంత మొత్తం మాంసానికి పెట్టలేక కూరగాయలు, పప్పు తదితర కూరలతోనే సరిపెట్టుకుంటున్నామని మాంసం ప్రియులు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు

మార్కెట్‌లో మటన్, ఇతర మాంసాలు విక్రయించాలంటే నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీవాన్ని వధించే ముందు పశువైద్యాధికారితో పరీక్షలు చేయించాలి. ఆరోగ్యంగా ఉందని నిర్ధయించిన తర్వాతే వాటిని వధించి మాంసాన్ని విక్రయించాలి. కొంతమంది ఇవేమీ చేయకుండానే విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందమంది మిగిలిపోయిన మాంసాన్ని ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నట్టు సమాచారం.

కోడిరకం	లైవ్	చికెన్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	100	190	210
లేయర్	110	190	-
నాటికోడి	450	600	
మటన్...			
పొట్టేలు	700 నుంచి 800 వరకు		
మేకపోతు	700 నుంచి 800 వరకు		